క్లుప్తంగా

ఎంపీటీసీ ఎన్నికలకు సిద్ధం



ఎన్నికల పనుల్లో నిమగ్నమైన అధికారులు

మునిపల్లి(అందోల్): స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియను ఎంపీడీఓ హరినందన్‌రావు పరిశీలించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో సంబంధిత అధికారులు అనుసరించాల్సిన విధానాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. 30 గ్రామ పంచాయతీల్లో 30 సర్పంచ్ స్థానాలు, 12 ఎంపీటీసీ స్థానాలున్నాయి. 60 పోలింగ్ స్టేషన్‌ల్లో ఇబ్బందికర 6 పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లు ఎంపీడీఓ తెలిపారు. పోలింగ్ స్టేషన్‌ల్లో విద్యుత్, తాగునీరు, ఫ్యాన్లు, బాత్రూం, టాయిలెట్లు, ఎన్నికల అధికారులు ఉండడానికి తగిన సౌకర్యం ఉందా లేదా అనే వివరాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



పూజలు చేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధి రాజోల గ్రామంలో మంగళవారం వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో వాల్మికి మహర్షి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు సత్యనారాయణ, శివరాజ్, వైజ్యనాథ్, మాణిక్యప్ప, రాజు, అశోక్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో తప్పిపోయిన బాలుడిని స్టేషన్ మాస్టర్ తల్లిదండ్రులకు అప్పగించారు. హైదరాబాద్–పూర్ణ ఎక్స్‌ప్రెస్ రైలులో కుటుంబ సభ్యులతో ప్రయాణిస్తున్న 5 సంవత్సరాల అఖిలేశ్ అనే బాలుడు మంగళవారం జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో తప్పిపోయాడు. స్టేషన్ మాస్టర్ మాధవకృష్ణ గుర్తించి చేరదీశారు. బాలుడి ద్వారా తల్లిదండ్రుల వివరాలు సేకరించి సమాచారం అందజేశారు. కర్నాటక రాష్ట్రం బీదర్ పట్టణంలో ఉంటున్న బాలుడు తండ్రి స్వామిదాస్‌రాజా స్టేషన్‌కు వచ్చి మాధవరావును కలిశారు. విచారించిన తరువాత బాలుడిని తండ్రికి అప్పగించారు.

రోడ్డు నిర్మించాలని కాలనీవాసుల ధర్నా



ధర్నా చేస్తున్న కాలనీవాసులు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని 8వ వార్డు హనుమాన్‌నగర్‌లోని హనుమాన్ మందిరం వరకు రోడ్డు నిర్మించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. మంగళవారం వికారాబాద్ రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారికి నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి మేనేజర్ ఉమెందర్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. అక్కడి నుంచి సంగారెడ్డి కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ ప్రవీణ్యను కలసి కాలనీ రోడ్డు, సమస్యల గురించి విన్నవించి వినతిపత్రం అందజేసి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు వీరయ్య, అంజన్న, రత్నాకర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేశ్వర్‌గౌడ్, సూర్యప్రకాష్, బాల్‌రాజ్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెక్కులు ఇవ్వాలి

జహీరాబాద్ టౌన్: పరిహారం చెక్కులు ఇవ్వాలని న్యాల్‌కల్ మండలంలోని మామిడ్గి గ్రామ రైతులు నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ విశాలాక్షి కోరారు. మంగళవారం గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆమెను కలిశారు. నిమ్జ్ ప్రాజెక్టులో తమ భూముల పరిహారం కోసం రెండు మూడు నెలల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామని వాపోయారు. డిప్యూటీ కలెక్టర్ సమాధానిమిస్తూ ఇటీవలె తాను బాధ్యతలు తీసుకున్నానని, అర్హులైన రైతులందరికీ చెక్కులను పంపిణీ చేస్తామని భరోసా ఇచ్చారు. మామిడ్గి గ్రామంలోని పట్టా భూములకు సంబంధించి మొదటి పరిహారం ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. 26, 27 సర్వే నంబర్‌లోని భూ ములకు సంబంధించిన ఫిర్యాదు వస్తున్నాయని, తహసీల్దార్‌తో మాట్లాడి పరిహారం అందేలా చూసామన్నారు.

అన్నదాత లబోదిబో..

నేలవాలిన వరి పంట

భారీ వర్షం అన్నదాతకు కడగండ్లు మిగిల్చింది. కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో వరి పైరు నేలవాలింది. పంట పొలాల్లో వర్షం నీరు చేరింది. కల్హేర్, ఫత్తేపూర్, బీబీపేట్, మార్డి, పోచాపూర్, అంతర్‌గాం, తదితర చోట్ల పంట నష్టం భారీగా వాటిల్లింది. అంతర్‌గాం శివారులో భారీ వరద ప్రవాహంతో చేతికోచ్చిన పంట నీటి పాలైందని రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

కల్హేర్(నారాయణఖేడ్)



అంతర్‌గాం శివారులో నేలవాలిన వరి



వరి పొలంలో నిలిచిన వర్షపు నీరు

తుది దశకు పంటల నమోదు

రాయికోడ్(అందోల్): మండలంలోని ఆయా క్లస్టర్లలో రైతులు సాగు చేసిన పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ తుదిదశకు చేరుకున్నట్లు మండల వ్యవసాయ అధికారి సారిక తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటివరకు 29 వేల ఎకరాల్లో రైతులు సాగు చేసిన పంటలు, రైతుల వివరాలు నమోదు చేశామన్నారు. మరో 4 వేల ఎకరాల్లో సాగవుతున్న పంటలను నమోదు చేయాల్సి ఉండగా వారం రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. ఇంకా పంటలను నమోదు చేసుకొని రైతులు విధిగా తమ పరిధిలోని ఏఈఓలను సంప్రదించి నమోదు చేయించుకోవాలని సూచించారు.

బీజేపీ ప్రభావం ఉండదు

- అలయ్–బలయ్ కార్యక్రమంలో రాజకీయాలా?
- అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల విమర్శలు
- పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న సంగమేశ్వర్

జోగిపేట/వట్‌పల్లి(అందోల్): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ప్రభావం ఉండదని పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. సంగమేశ్వర్ పేర్కొన్నారు. జోగిపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వట్‌పల్లిలో జరిగిన అలయ్–బలయ్ కార్యక్రమాల్లో మాజీమంత్రి హరీశ్‌రావు ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. అసెంబ్లీ, లోకసభ ఎన్నికల్లో నరేంద్రమోదీ హవాలో ఓట్లు సంపాదించారని, స్థానిక ఎన్నికల్లో మూడవ స్థానంలో ఉంటారన్నారు. మల్లన్నసాగర్, కాళేశ్వరం ప్రాజెక్టులు ప్రజాధనంతో కట్టారని కేసీఆర్ సొంత డబ్బులతో కట్టలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే హరీశ్‌రావు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారాన్ని కోల్పోగా, ఎంపీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలుపొందలేదన్నారు. స్థానిక ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్‌కు గుండుసున్నా తప్పదని జోస్యం చెప్పారు. అలయ్–బలయ్ కార్యక్రమాల్లో రాజకీయ విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అందోలు నియోజకవర్గ వ్యాప్తంగా మంత్రి దామోదర రాజనర్సింహ సుమారు రూ.వెయ్యి కోట్ల నిధులను మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపట్టారని వివరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎస్.జగన్మోహన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్లు ఎం.జగన్మోహన్‌రెడ్డి, కొప్పుల లక్ష్మి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు తప్పనిసరి

మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ మల్లేశం



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశం

సంగారెడ్డి జోన్: జిల్లాలో పత్తి సాగు చేసిన రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేందుకు కపాస్ కిసాన్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ మల్లేశం పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు, అమ్మకాలపై కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ శాఖ జేడీ మాట్లాడుతూ.. యాప్‌లో సలహాల కోసం 18005995779 టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పత్తి కొనుగోళ్లలో దళారి వ్యవస్థ నిర్మూలించి రైతులు నేరుగా సీసీఐకి అమ్ముకునేలా యాప్ రూపొందించడం జరిగిందన్నారు. యాప్ వినియోగంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, తదితరులు, పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమిస్తే కఠిన చర్యలు

ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి



ఆక్రమణలను తొలగిస్తున్న ట్రాఫిక్ సీఐ

సంగారెడ్డి క్రైమ్: సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉలంఘిస్తూ పట్టణంలోని ప్రధాన రోడ్లను ఆక్రమించి వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తప్పవని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. సోమవారం పట్టణ ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పాత బస్టాండ్‌లోని సినిమా రోడ్డులో వ్యాపారస్తులు, చిరు వ్యాపారులు కిలోమీటర్ వరకు రోడ్లను ఆక్రమించి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే పట్టణ ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది రోడ్డుకు అడ్డంగా ఉన్న వాటిని తొలగించారు. పట్టణంలో ఇకపై ఎవరైనా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలు, జరిమానా తప్పదని స్పష్టం చేశారు.

రోడ్డు పనులు పూర్తి చేయండి

టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి, నిర్మలారెడ్డి

సంగారెడ్డి: త్వరితగతిన రోడ్డు పనులను పూర్తి చేయాలని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని బైపాస్ రోడ్డు పనులను జగ్గారెడ్డి కలిసి పరిశీలించారు. రోడ్డు పనులు ఆలస్యంపై అసహనం వ్యక్తం చేశారు. పనుల జాప్యానికి కారణాలను హెచ్ఎండీఏ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు కరెంటు స్తంభాలు వల్ల రోడ్డు పనులు జాప్యం జరుగుతుందన్నారు. డిప్యూటీ ఇంజినీర్ ఎలక్ట్రిసిటీ ఫారెస్ట్ అధికారులను స్వయంగా పరిశీలనకు తీసుకెళ్లి తగు సూచనలు చేశారు. పనులు వేగంగా చేయాలని ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని చెప్పారు. బైపాస్ రోడ్డులో నాలుగు జంక్షన్‌లు ఏర్పాటు చేయాలని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎండీఏ ఏఈ వెంకన్న, ఎలక్ట్రిసిటీ ఏడీఈ లక్ష్మన్, ఆర్ అండ్‌బీ డీఈ రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ డీఈ రఘు, ఫారెస్ట్ అధికారులు, నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి ఆంజనేయులు, సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ పెన్షన్ మంజూరు చేయాలి

జహీరాబాద్ టౌన్: వికలాంగుల పెండింగ్ పెన్షన్‌లను చెల్లించాలని జాతీయ వికలాంగుల హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కొనింటి నర్సింలు అన్నారు. స్థానిక నాయకులు రాజ్‌కుమార్, అహ్మద్‌తో కలిసి మంగళవారం తహసీల్దార్ దశరథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికలాంగులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. చేయూత పెన్షన్ల కోసం వేల మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఇంతవరకు ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేయడం లేదని వాపోయారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ విగ్రహం ఊరేగింపు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని రజకకేరీ పెద్దమ్మ భవానీ మందిరం అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. జీటీఆర్ డెవలపర్స్ తుల్జారాం ఆధ్వర్యంలో ఆలయం నుంచి ప్రారంభమైన ఉత్సవ ఊరేగింపు పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు రజకకేరీ, శాస్త్రీరోడ్, గాంధీచౌక్ నుంచి తిరిగి మందిరం వరకు కొనసాగింది. ఊరేగింపులో మహిళల భక్తిపాటలు, యువకుల డ్యాన్సులతో ఉత్సాహంగా సాగింది. ముఖ్య అతిథిగా టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, పట్టణ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, సిద్ధన్న, మాజీ కౌన్సిలర్ జయరాములుగౌడ్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్



విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

పటాన్‌చెరు టౌన్: డివిజన్‌లో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తున్నానని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ కాలనీలో పర్యటించి అక్కడ నెలకున్న విద్యుత్ లూస్‌లైన్లు, మిడిల్ పోల్స్ వంటి సమస్యలను పరిశీలించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సీజీఎం కామేశ్వర రావు, ఎస్ఈ శ్రీనాథ్ ,డీఈ భాస్కర్‌రావు, ఏడీఈ సంజీవ్, ఏఈ జగదీశ్, లైన్‌మెన్‌లు కాలనీవాసులు పాల్గొన్నారు.

రూ.కోటి పరిహారం చెల్లించాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు



బాధిత కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

పటాన్‌చెరు టౌన్: సిగాచి పరిశ్రమ ప్రమాద బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి ప్రకటించిన రూ.కోటి హామీ వంద రోజులైనా ఎందుకు అమలు చేయలేదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు ప్రశ్నించారు. ప్రమాదానికి కారణమైన పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంలో ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆయన నిలదీశారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలతో కలిసి భారీ ధర్నా నిర్వహించడం జరిగింది. అనంతరం జాయింట్ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమ, రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ, రాష్ట్ర నాయకులు సోమన్న, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి. పాండు రంగారెడ్డి పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను కూల్చివేయిస్తున్న అధికారులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని అక్రమ నిర్మాణాలను మంగళవారం మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావు తొలగించారు. ఆదర్శనగర్ కాలనీ రోడ్డులో కొంతమంది రహదారిని అక్రమించి నిర్మాణాలు చేపట్టారు. 50 ఫీట్ల రోడ్డు ఆక్రమణల వల్ల కుదించుకుపోయింది. నిత్యం రద్దీగా ఉండే రోడ్డు ఇరుకుగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆదర్శనగర్, దత్తగిరి కాలనీ ప్రజలు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి అక్రమణలను తొలగించాలని ఇటీవల వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు కమిషనర్ అక్రమణదారులకు నోటీసులు జారీ చేశారు. అయినా వారు పట్టించుకోకపోవడంతో కమిషనర్ సుభాష్‌రావు రెవెన్యూ, పోలీసు అధికారులతో కలిసి జేసీబీ సహాయంతో నిర్మాణాలను తొలగించారు. రహదారులు అక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టం ప్రకారం కేసులు పెడుతామని కమిషనర్ హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

108లో మహిళ ప్రసవం

కల్హేర్(నారాయణఖేడ్): పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళ 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. మంగళవారం సిర్గాపూర్ మండలంలో సంఘటన జరిగింది. సర్పంచ్ తండాకు చెందిన జాదవ్ సంగీత పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబీకులు 108కు సమచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో సిర్గాపూర్ పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డలకు పీహెచ్‌సీలో చికిత్స అందించారు.

మృతుడి కుటుంబానికి అండ

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం పట్టణ పరిధిలోని పోచమ్మ బస్తీలో నివాసముండే ఆటో డ్రైవర్ యాదగిరి ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబానికి సహచర డ్రైవర్లు అండగా నిలిచారు. ఆటో యూనియన్ ప్రెసిడెంట్, రాష్ట్ర కార్మిక నాయకుడు వరప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.30 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగిరెడ్డి, జంగిరెడ్డి, రామచంద్రారెడ్డి, లక్ష్మీనారాయణ, కృష్ణ, ప్రశాంత్, రాము పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల వేలం

పటాన్‌చెరుటౌన్: పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ గంజాయి కేసులో పట్టుపడిన ఆరు ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిప్యూటీ కమిషనర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ మెదక్ ఆదేశాల మేరకు జిల్లా మద్యనిషేధ అధికారి సమక్షంలో పటాన్‌చెరు ఎక్సైజ్‌స్టేషన్ ఆవరణలో బుధవారం ఉ.10 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు చెప్పారు. వేలంలో పాల్గొనే వారు నిర్ణీత ధరవత్తు చెల్లించి పాల్గొనాలన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అక్రమంగా తరలిస్తున్న 28 టన్నుల రేషన్ బియ్యాన్ని తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు రింగ్‌రోడ్డుపై పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన షేక్ మహబూబ్ బహదూర్ శంషాబాద్ నుంచి రేషన్ బియ్యాన్ని అక్రమంగా లారీలో లోడ్ చేసుకుని కర్ణాటకకు తీసుకెళ్తున్నాడు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని కొల్లూరు రింగ్‌రోడ్డుపై ఎస్ఐ రమేశ్ ఆధ్వర్యంలో లారీని తనిఖీ చేయగా బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీని సీజ్ చేసి 28 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

74 పశువుల షెడ్‌లు మంజూరు

రాయికోడ్(అందోల్): జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల పోషకులకు 74 పశువుల షెడ్లు మంజూరు అయినట్లు ఏపీఓ రమేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఒక్కో పశువుల షెడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.92 వేలు మంజూరు చేస్తోందన్నారు. 16–12 ఫీట్ల విస్తీర్ణంలో షెడ్డు నిర్మించుకోవాల్సి ఉంటుందన్నారు. మంజూరు పొందిన పోషకుల్లో 14 మంది షెడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. కనీసం మూడు పశువులు కలిగి ఉన్న పోషకులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భవానీ మాత పల్లకీ ఊరేగింపు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణ సమీపంలో హోతి(కె)పరిధి భవానీ మాత ఆలయంలో లోక కల్యాణార్థం మంగళవారం ఉత్సవాలు నిర్వహించారు. ఆయన ప్రధాన పూజారి కుడంబల్ ఆయి ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, పూజలు చేశారు. అనంతరం భవానీ మాత పల్లకీ సేవ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాల వితరణ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం, పద్మశాలి సంఘం అధ్యక్షుడు జనార్దన్, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి అంబదాస్, బీజేపీ నాయకులు అరుణ కౌలాస్, భక్తులు, వ్యాపారులు పాల్గొన్నారు.


రైతులను ఆదుకోవాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని జనజాగృతి సేన అధ్యక్షుడు కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వెంకటాపూర్ శివారులో భారీ వర్షాలతో నష్టపోయిన పత్తి పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...గత 30 సంవత్సరాల్లో చూడని వర్షాలు, ఈ ఏడాది పడటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎకరాకు రూ. 50వేల నష్టపరిహారాన్ని అందించాలని కోరారు. కౌలు రైతుల పరిస్థితి మరీదారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సాయికుమార్, సందీప్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో పోషకాలు

నారాయణఖేడ్: చిరుధాన్యాలు, ముతక ధాన్యాలతో పోషకాహారం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత తెలిపారు. మంగళవారం నిజాంపేట్ మండలం బాచేపల్లిలోని అంగన్‌వాడీ సెక్టార్‌లో పోషణ మాసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. పాలిచ్చే తల్లులు, గర్భిణులు , కిశోర బాలికలకు పోషకాహారం చాలా అవసరమన్నారు. చిరు ధాన్యాలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ సుశీల, సెక్టార్ సూపర్‌వైజర్ ప్రమీల, మహిళా సాధికారిత కేంద్రం ఫైనాన్షియల్ స్పెషలిస్టు నర్సింహులు పాల్గొన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు.

ప్రాథమిక పాఠశాల సందర్శన



సదాశివపేట(సంగారెడ్డి): విద్యార్థుల ఫేషియల్ అటెండెన్స్ ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో ఆన్‌లైన్ చేయాలని ఎంఈఓ శంకర్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం పట్టణం కోహిర్ బేస్‌లోని ప్రభుత్వ రవీంద్రమోడల్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో తరగతి వారీగా విద్యార్థుల హాజరు శాతం పరిశీలించగా తక్కువగా ఉందన్నారు. సంబంధిత ఉపాధ్యాయులు తరగతిలోని విద్యార్థుల ఫేషియల్ అటెండెన్స్ ఆన్‌లైన్ తొందరగా పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించగా కొందరు చదవడం, రాయడంలో వెనుకబడ్డారని వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మంచి రుచికరమైన భోజనం విద్యార్థులకు పెట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎం సరిత, సీఆర్పీ రాజేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయండి

కంది(సంగారెడ్డి): పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఆశవర్కర్లు వైద్య సిబ్బంది కృషి చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ సాయి శంకర్ పేర్కొన్నారు. మంగళవారం కంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలంలోని సబ్ సెంటర్ల డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లతో సమావేశమ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయిశంకర్ మాట్లాడుతూ.. ఈనెల 12 నుంచి 15 వరకు పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. 12న మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పోలియో చుక్కలు చేయనున్నట్లు తెలిపారు. 13 నుంచి15 వరకు వైద్య సిబ్బంది ఆశవర్కర్లు ఇంటింటికి వెళ్లి మిగిలిపోయిన వారందరికీ వేస్తారని అన్నారు. మండలంలోని చిదురుప్పలోని సబ్‌సెంటర్ నేషనల్ క్వాలిటీ ఆష్యురెన్స్ సర్వీసెస్‌కు ఎంపిక కావడంతో అక్కడి వైద్యురాలు సుధారాణిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయా సబ్ సెంటర్ల డాక్టర్లు, నర్సింగ్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

జిన్నారం (పటాన్‌చెరు): రామాయణ రచయిత ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను సోమవారం జిన్నారం, గడ్డపోతారం, బొల్లారం, గుమ్మడిదల మున్సిపల్ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్లు మాట్లాడుతూ... రామాయణం రచయితగా, సాంస్కృతంలో మొదటి ఇతిహాసమైన ఆదికావ్యం రచయితగా ప్రసిద్ధి పొందారని కొనియాడారు. హిందూమతంలో ఆయన ఉన్న విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో కమిషనర్లు తిరుపతి, వెంకటరామయ్య, కిషన్, దశరథ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.